దోపిడీ రూటు మార్చిన మిల్లర్లు

- ధాన్యం లారీలో బస్తాలు మాయం
- ప్రతి లారీకి 8 నుంచి 10 బస్తాలు కట్
- ట్రక్ షీట్‌లో తగ్గుతున్న బస్తాల లెక్కలు
- ఎండ పేరు చెప్పి రైతులకు టోకరా
- పరేషాన్‌లో కేంద్రాల నిర్వాహకులు

మంచిర్యాల, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీ పెచ్చుమీరిపోతున్నది. నిన్న మొన్నటివరకు 40 కిలోల వడ్ల బస్తాకు 41 కిలోల నుంచి 42 కిలోలు వరకు జోకారు. ఈ విషయంపై పత్రికల్లో కథనాలు రావడంతో దోపిడీ తీరు మారింది. మంచిర్యాల జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ప్రస్తుతం బస్తాకు బస్తా వెయిట్ మాత్రమే వేస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లాక అక్కడ లారీ లోడ్‌కు 8 బస్తాల నుంచి 10 బస్తాలు అంటే 320 కిలోల నుంచి 400 కిలోల వరకు కటింగ్ పెడుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రంలో రైతులు వేసిన బస్తాలకు మిల్లులు ట్రక్ షీట్‌లో ఇచ్చే బస్తాలకు తేడా ఉంటుంది. ఉదాహరణకు కొనుగోలు కేంద్రంలో నలుగురు రైతులు 500 బస్తాలు విక్రయిస్తే, మిల్లులు ఇచ్చే ట్రక్ షీట్‌లో 492 బస్తాల నుంచి 490 బస్తాలు వస్తున్నాయి. అంటే ఒక్కొక్క రైతుకు సగటున రెండు నుంచి రెండున్నర బస్తాలు తక్కువ పడుతున్నాయి. ఇలా ప్రతి రైతుకు కొంత ధాన్యం కట్ చేయాల్సి వస్తున్నది. దీనిపై మిల్లర్లను సంప్రదిస్తే కొనుగోలు కేంద్రంలో జోకిన సంచి మిల్లులకు వచ్చేసరికి బరువు తగ్గుతుందని పేర్కొంటున్నారు. లారీ అన్‌లోడ్ కాక మిల్లు దగ్గర రెండు, మూడు రోజులు ఉండాల్సి వస్తున్నది. దీని వల్ల ఎండకు వడ్ల బరువు 200 గ్రాముల నుంచి 300 గ్రాముల వరకు తగ్గుతుందని మిల్లరు చెబుతున్నారు. అలా చూసుకున్నా బస్తా బరువు 750 గ్రాములు అదనంగా జోకుతున్నారు. అలాంటప్పుడు బస్తాలకు బస్తాలు బరువు ఎందుకు తీస్తున్నారన్నది అర్థం కావడం లేదు.

కేంద్రాల నిర్వాహకులపై భారం

జిల్లాలో కొనుగోలు కేంద్రాల నిర్వహణ గందరగోళంగా ఉన్నది. మంచిర్యాల నియోజకవర్గంలో డీసీఎంఎస్, పీఏసీఎస్ కేంద్రాల స్థానంలో ఐకేపీలకు సెంటర్లు ఇచ్చారు. బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల్లో సెంటర్ల ఇన్‌చార్జిలను మార్చారు. కొత్తగా వచ్చిన నిర్వాహకుల వద్ద మాయిశ్చర్ మిషన్లు, కాంటాలు, ట్యాబ్‌లు లేవు. వాస్తవానికి ఇవన్నీ మార్కెటింగ్ శాఖ సరఫరా చేయాలి. కానీ గతంలో అందజేసిన దృష్ట్యా కొత్తవి ఇవ్వలేదు. పాత నిర్వాహకులు తిరిగి ఇవ్వకపోవడం, మిషన్లు పాడై పోవడంతో కొత్తగా కొనాల్సిన పరిస్థితి. మాయిశ్చర్ మిషన్‌కు రూ.5,500, కాంటాకు రూ.10 వేలు, ట్యాబ్‌కు రూ.20 వేలు వరకు ఖర్చు అవుతున్నాయి. మొత్తంగా రూ.35 వేల నుంచి రూ.40 వేలు సొంతంగా పెట్టుకోవాల్సి వచ్చిందని కొత్తగా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జిలు వాపోతున్నారు. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో జోకిన రైతుల బస్తాలను మిల్లర్లు తగ్గిస్తున్నారు. దీంతో రైతులకు సమాధానం చెప్పుకోలేక ఇన్‌చార్జిలు లబోదిబోమంటున్నారు.

మిల్లర్లతో పరేషాన్ అవుతున్నది

కొనుగోలు కేంద్రంలో కాంటా పెట్టి మిల్లులకు తీసుకువెళ్తే రోజుల తరబడి కాంటా వేయడం లేదు. చివరకు ఎండలకు బరువు తగ్గిందని చెప్పి లారీలోడ్‌లో బస్తాలు కట్ చేస్తున్నారు. నాది మొన్నొక లారీ తీసుకెళ్తే 10 బస్తాలు కటింగ్ పెడతామన్నరు. ఆ లోడ్‌లో 840 బ్యాగులు పంపిన. కటింగ్ అని చెప్పగానే ధాన్యం అమ్మిన 8 మంది రైతులను కూడా మిల్లు కాడికి తీసుకుపోయిన. పది బస్తాలు కట్ చేస్తా అన్నోళ్లు చివరికి 8 బస్తాలు కట్ చేశారు. ఏ రైతు ధాన్యంలో తేడా ఉందో వారికే కట్ చేయమన్నాం. లోడ్ మొత్తానికి కోత పెట్టడంతో ఒక్కో రైతు కనీసం బస్తా నష్టపోవాల్సి వచ్చింది.

– పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు.

'సుల్తానాబాద్ గురుకుల' ప్రిన్సిపాల్ సస్పెన్షన్

పెద్దపల్లి, ఏప్రిల్ 24: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటుపడ్డది. ఈ నెల 18న అల్పాహారం వికటించి 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధికారులు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ మేరకు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ ఎస్ సత్యప్రసాద్‌రాజ్‌ను బుధవారం పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. కేర్‌టేకర్, అసిస్టెంట్ కేర్‌టేకర్లకు షోకాజ్ నోటీసులిచ్చి, సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. సస్పెన్షన్‌కు గురైన ప్రిన్సిపాల్ అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లవద్దని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ రామస్వామికి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

భువనగిరి గురుకుల కేర్‌టేకర్‌పై వేటు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): యాదాద్రి-భువనగిరి జిల్లాలోని భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కేర్‌టేకర్ ఎం పండయ్యను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి ఉత్తర్వులిచ్చారు. ఇటీవల పాఠశాలలో కలుషితాహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవగా, ఒక విద్యార్థి మృతి చెందాడు.

కేజీబీవీ విద్యార్థికి 988 మార్కులు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ప్రతిభ చాటారు. ఎం అనూష ఎంపీసీలో 988 మార్కులు, బైపీసీలో జీ గంగాభవాని 987తో టాపర్లుగా నిలిచారు. ఎంపీసీలో ఆదిలక్ష్మి 983, ఎస్కే మున్నీ 982, రామనీల 982, కే తేజస్విని 981 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో ఎం పావని 467, ఎం లావణ్య 464, జే అను 464 మార్కులు సాధించారు.

సర్కారు కాలేజీల్లో తగ్గిన ఉత్తీర్ణత

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఇంటర్ ఫలితాల్లో సర్కారు జూనియర్ కాలేజీలు డీలాపడ్డాయి. ఫస్టియర్, సెకండియర్‌లోనూ గతేడాదితో పోల్చితే ఫలితాలు పడిపోయాయి. ఈ ఏడాది ఫస్టియర్‌లో 38.21%, సెకండియర్‌లో 49.13% ఉత్తీర్ణత నమోదైంది. నిరుడు ఫస్టియర్‌లో 40% , సెకండియర్‌లో 54శాతం ఉత్తీర్ణత నమోదైంది. జనరల్ గురుకుల సొసైటీలో 35 కాలేజీలుండగా, ఫస్టియర్‌లో 86.84% , సెకండియర్‌లో 92.53% విద్యార్థులు పాసయ్యారు.

గురుకులాల సత్తా

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఇంటర్ ఫలితాల్లో గురుకులాలు సత్తా చాటాయి. సెకండియర్‌లో 84.07శాతం ఉత్తీర్ణత నమోదైంది. అమ్మాయిల ఉత్తీర్ణత శాతం (87.26), అబ్బాయిల కన్నా సీవోఈల్లో (76.29)ఎక్కువగా ఉన్నది . ఫస్టియర్ 94.64 శాతం, సెకండియర్ 93.6శాతం ఉత్తీర్ణత సాధించినట్టు గురుకులాల సొసైటీ తెలిపింది.

బీసీ గురుకుల విద్యార్థుల హవా

ఇంటర్ ఫలితాల్లో బీసీ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. సెకండియర్‌లో 7,834 మందికి గానూ, 6643 మంది ఉత్తీర్ణత సాధించారు. 142 కాలేజీల్లో 'ఏ' గ్రేడ్ (75 శాతం మార్కులు) సాధించిన విద్యార్థులు 4810 మంది ఉన్నారు. 'బీ' గ్రేడ్ (60శాతం మార్కులు) విద్యార్థులు 1,446 మంది ఉన్నారు.

మిల్లర్ల దోపిడీని సహించేదిలేదు

- తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు
- పౌరసరఫరాల సంస్థ హెచ్చరిక

నమస్తే ఎఫెక్ట్

నిజామాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సన్నరకం వడ్లపై రైస్ మిల్లర్ల దోపిడీని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రైతుల నుంచి మిల్లర్లు మద్దతు ధర కన్నా తక్కువ చెల్లించి సన్నరకం వడ్లను కొనుగోలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల సంస్థ హెచ్చరించింది. మిల్లర్ల దోపిడీపై నమస్తే తెలంగాణ ప్రధాన సంచికలో 'సన్నధాన్యం దళారుల పాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. నిజామాబాద్ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ జగదీశ్ ద్వారా వివరణను విడుదల చేసింది. బహిరంగ మార్కెట్లో క్వింటాల్ సన్నరకం వడ్లకు రూ.2300 నుంచి రూ.2600 వరకు డిమాండ్ ఉన్నట్టు అధికారులు అంగీకరించారు. ఎవరైనా మధ్యవర్తులు, రైస్ మిల్లర్లు రైతులను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకోకుండా ఎలాంటి షరతులు, ఆంక్షలు లేవని పౌరసరఫరాల సంస్థ పేర్కొన్నది. రైస్ మిల్లర్లు ప్రభుత్వ ఉద్దేశాన్ని దెబ్బతీస్తూ ఇష్టారీతిన కొనుగోళ్లకు పాల్పడితే పౌరసరఫరాల సంస్థకు ఫిర్యాదు చేయాలని రైతులకు అధికారులు సూచించారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌కు లైన్ క్లియర్

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): యాదాద్రి మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆ ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తికి లైన్ క్లియర్ చేసింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ బుధవారం మినిట్స్‌ను విడుదల చేసింది. గతంలో ఈ ప్లాంట్ నిర్మాణానికి జారీచేసిన పర్యావరణ అనుమతి (ఈసీ)ని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సస్పెండ్ చేసింది. స్వదేశీ బొగ్గుతో పాటు, విదేశీ బొగ్గును ఉపయోగించేందుకు అనుమతులున్న ఈ ప్లాంట్‌ను స్వదేశీ బొగ్గు మాత్రమే వినియోగించేలా నిర్మిస్తుండటమే ఇందుకు కారణం. దీంతో ఈసీ ఉత్తర్వుల్లో పలు సవరణలు చేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ సూచించింది. రాష్ట్రంలో స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచాలన్న లక్ష్యంతో గతంలో కేసీఆర్ ప్రభుత్వం నల్లగొండ జిల్లా దామరచర్లలోని వీర్లపాలెంలో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను నిర్మించ తలపెట్టిన విషయం తెలిసిందే.

అక్టోబర్ చివరిలోగా ఉత్పత్తి షురూ

యాదాద్రి మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌కు లైన్ క్లియర్ కావడంతో త్వరలో ఈ ప్లాంట్‌ను వినియోగంలోకి రానున్నది. తొలుత స్టీమ్ జనరేటర్లు, ఇతర యంత్రాల పనితీరును పరిశీలించి అక్టోబర్ చివరిలోగా ఈ ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి విడతలో రెండు ప్లాంట్ల ద్వారా 1,600 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు టీఎస్ జెన్‌కో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలదే హవా

- ఫస్టియర్, సెకండియర్‌లోనూ పైచేయి
- ఫస్టియర్‌లో 60.01%, సెకండియర్‌లో 64.19%ఉత్తీర్ణత
- ఫలితాల్లో రంగారెడ్డి, ములుగు టాప్
- చివర కామారెడ్డి, సూర్యాపేట
- ఫస్టియర్‌లో తగ్గిన ఉత్తీర్ణత
- సెకండియర్‌లో పెరిగిన పాస్ శాతం

సంవత్సరాల వారీగా ఉత్తీర్ణత శాతం

సంవత్సరం	ఫస్టియర్(శాతం)	సెకండియర్(శాతం)
2020	61.08	69.64
2021 (కరోనా)	100	100
2022	64.86	68.68
2023	62.85	62.27
2024	61.06	69.46

ఫలితాల వివరాలిలా..

సంవత్సరం	హాజరైనవారు	ఉత్తీర్ణులైనవారు	ఉత్తీర్ణత శాతం
ఫస్టియర్	4,78,723	2,87,261	60.01
సెకండియర్	5,02,280	3,22,432	64.19

అమ్మాయిలు, అబ్బాయిల ఉత్తీర్ణత శాతం (జనరల్, వొకేషనల్ కలిపి)

ఫస్టియర్‌లో	అమ్మాయిలు	అబ్బాయిలు
మొత్తం విద్యార్థులు	2,41,682	2,37,041
పాసైన వారు	1,65,190	1,22,071
ఉత్తీర్ణతశాతం	68.35	51.50
సెకండియర్‌లో	**అమ్మాయిలు**	**అబ్బాయిలు**
మొత్తం విద్యార్థులు	2,47,358	2,54,922
పాసైన వారు	1,79,412	1,43,020
ఉత్తీర్ణతశాతం	72.53	56.10

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): ఎప్పటిలాగే ఈసారి కూడా ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలు అదుర్స్ అనిపించారు. ఫస్టియర్, సెకండియర్‌లోనూ బాలికలే పైచేయి సాధించారు. ఫస్టియర్ ఫలితాల్లో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, కామారెడ్డి అట్టడుగున నిలిచింది. సెకండియర్‌లో ములుగు జిల్లా టాప్‌లో ఉండగా, సూర్యాపేట చివరి స్థానంలో నిలిచింది. బుధవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఇంటర్ ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, బోర్డు కార్యదర్శి శృతి ఓజా విడుదల చేశారు. అత్యధికులు 'ఏ' గ్రేడ్‌లోనే పాసయ్యారు. ఫస్టియర్‌లో 60.01% , సెకండియర్‌లో 64.19% ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్‌లో ఉత్తీర్ణతశాతం పెరిగింది. ఫస్టియర్‌లో మూడేండ్లుగా తగ్గుతూ వస్తున్నది.

జిల్లాల వారీగా..

ఫస్టియర్‌లో రంగారెడ్డి జిల్లా 71.7శాతం ఉత్తీర్ణతతో ప్రథమస్థానంలో ఉండగా.. మేడ్చల్ జిల్లా 71.58%తో ద్వితీయ స్థానంలో, ములుగు జిల్లా 70.01%తో తృతీయ స్థానం లో నిలిచాయి. కామారెడ్డి (44.29%), నారాయణపేట(53.61%), మెదక్ (57. 49%) ఉత్తీర్ణతతో చివరి మూడుస్థానాల్లో నిలిచాయి. సెకండియర్‌లో 82.95% ఉత్తీర్ణతతో ములుగు ప్రథమ స్థానం, 79.31%తో మేడ్చల్ ద్వితీయ స్థానం, 77.63%తో రంగారెడ్డి తృతీయ స్థానం దక్కాయి. సూర్యాపేట (39.9), యాదాద్రి(41.7), సిద్దిపేట(42.4%) ఉత్తీర్ణతతో చివరి మూడుస్థానాల్లో నిలిచాయి.

'ఏ' గ్రేడ్‌లోనే అత్యధికులు పాస్

ఇంటర్‌లోఅత్యధికులు 'ఏ' గ్రేడ్‌లోనే పాసయ్యారు. ఫస్టియర్‌లో 2,87లక్షల మంది పాస్ కాగా, వీరిలో 1.86 లక్షలమంది 75శాతానికి పైగా మార్కులతో 'ఏ' గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యారు. 68,985 మంది 'బీ' గ్రేడ్‌లో, 23,968 మంది 'సీ' గ్రేడ్‌లో, 8,283 మంది 'డీ' గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 1.94 లక్షలమంది 'ఏ' గ్రేడ్, 78 వేలమంది 'బీ' గ్రేడ్, 25 వేల మంది 'సీ' గ్రేడ్, 8 వేలమంది 'డీ' గ్రేడ్‌లో పాసయ్యారు.

మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి నిర్వహిస్తారు. ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకండియర్ పరీక్షలు జరుగనున్నాయి. ఈనెల 25నుంచి మే 2వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కొరకు అభ్యర్థులు బుధవారం నుంచి మే 2వరకు ఫీజు చెల్లించవచ్చు. రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.100, రీవెరిఫికేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.600 ఫీజు చెల్లించాలి. ఫలితాలకు సంబంధించిన ఫిర్యాదులంటే 040 - 24655027 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ చరిత్రాత్మక విజయం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు చరిత్రాత్మక విజయం సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి కొనియాడారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు టీ శ్రుతి 468, సీహెచ్ శ్రీహిత 468, వీ ప్రణవి 468, ఏ శశిప్రీతమ్ 468, కే వర్షిత్ 468, కే రుత్విక్ 468, ఎస్ కార్తికేయ 468, కే సృజల్ 468, టీ వర్షిత 468, ఎం శ్రీవర్ష 468, పీజీ ప్రియామృత 468, కే వర్షిణి 468, ఈ ప్రసన్న 468, ఎం రుత్విక 468, జీ లక్ష్మీప్రసన్న 468, కే అభిలాష్ 468 మార్కులు సాధించారని తెలిపారు. మరో 65 మంది విద్యార్థులు 467 మార్కులు, 117 మంది విద్యార్థులు 466 మార్కులు సాధించారని వివరించారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకుగానూ బీ నీలిమ 438 మార్కులతో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఎనిమిది మంది విద్యార్థులు 437 మార్కులు, 25 మంది 436 మార్కులు పొందారని పేర్కొన్నారు. ఎంఈసీలో టీ అఖిల్ 494 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో, ఎం సహస్రరెడ్డి 493, వీ అక్షయ్‌వర్ధన్ 493 మార్కులు సాధించారని వెల్లడించారు. సీఈసీలో సృష్టిత 492, బీ గ్రీష్మ 491 మార్కులు సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో 1000 మార్కులకు కే కార్తీకబాబు 993, టీ సాహిత్య 993 రాష్ట్రస్థాయిలో అత్యున్నత స్థానంలో నిలిచారని తెలిపారు. హర్షిత 992, బీ నిహారిక 992, ఎం పల్లవి 991, డీ శివాంజలి 991, పీ విశ్వాణి 991, కె మిత్రా 991, ఎల్ అస్మిత 991, మారియామావిన్ 991, జీ ఉమాకాంత్ 991 మార్కులు సాధించారని వివరించారు. బైపీసీలో సీహెచ్ నిఖిల్ 990, బీ అమిత 990, ఏ శ్రీనిధి 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో విశిష్టస్థానంలో నిలిచారన్నారు. ఎంఈసీలో ఎం వినమ్రత 974, జీ మహేశ్ కుమార్ 974 మార్కులు, సీఈసీ విభాగంలో నిమ్రా అజ్మీ 978, ఎం నజీర్ 972 మార్కులు పొందారని నరేందర్‌రెడ్డి వివరించారు.

ఉత్తమ మార్కులను సాధించిన ఇంటర్ విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ రెడ్డి

ట్రినిటీ అద్భుత ప్రతిభ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లి కళాశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. ఉన్నతమైన విదార్థులను తయారు చేయడంలో ట్రినిటీ విద్యా సంస్థలు ముందుటాయని చెప్పారు. తమ పూర్వ విద్యార్థి నందాల సాయి కిరణ్ సివిల్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు యశ్వంత్, మణిదీప్, వైశాలి, ఆసియా నూరిన్, అజయ్, సాత్విక్, రవళి 468 మార్కులు సాధించారని తెలిపారు. అఫిషా షకీల్, సాహితి, శ్రావ్య, వైష్ణవి, వైష్ణవి, సంజన, ప్రణతి, శ్రావ్య, హితేశ్, మహేశ్, డేవిడ్ రాజు, నవదీప్, మేఘన, శ్రీవందన 467 మార్కులు సాధించగా, మరో 23 మంది 466 మార్కులు పొందారని వివరించారు. బైపీసీలో సింధు 438 మార్కులు, అంజనీ, సుమయ్య ఫాతిమా, అనీకా ఇస్పాత్, ప్రసన్న, ఆర్ సృజన కుమార్ 437 మార్కులు, తొమ్మిది మంది విద్యార్థులు 438 మార్కులు సాధించారని తెలిపారు. సీఈసీ విభాగంలో రమ్య 487 మార్కులు, మేఘునాథ్ 485 మార్కులు, ఎంఈసీ విభాగంలో రిషిక శర్మ 488 మార్కులు సాధించారని వివరించారు. సెకండియర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ప్రశాంత్ 992 మార్కులు, అభినయ 991, లహరి, శ్రీవిద్య, శ్రీతేజ, ప్రవళిక, మహాలక్ష్మి 990 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో విదా హర్మిన్, రాణి, మెంజబీన్‌కు 990 మార్కులు రాగా, ఆరుగురికి 989, నలుగురికి 988 మార్కులు వచ్చినట్టు వివరించారు. సీఈసీ విభాగంలో సంజన 976 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

30న పదోతరగతి ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి ఫలితాలను ఈ నెల 30న విడుదల చేయనున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. బుధవారం ఇంటర్‌బోర్డులో తనను కలిసిన విలేకరులతో ఈ విషయాన్ని పంచుకొన్నారు.

భర్త కోసం ఆలయం

- 2020లో కరోనాతో మృతి చెందిన హరిబాబు
- గుడి నిర్మించి విగ్రహం పెట్టి పూజలు చేస్తున్న భార్య

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 24: మహబూబాబాద్ మండలం సోమ్లాతండాలో భర్త పేరిట గుడి నిర్మించి, అందులో విగ్రహం ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నది కళ్యాణి. బానోత్ హరిబాబు-కళ్యాణి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. 2020లో కరోనా సోకి హరిబాబు చనిపోయాడు. భర్తను ఏదో రూపంలో చూసుకోవాలనుకున్న కళ్యాణి తండా చివర ఉన్న తన భూమిలో ఆలయాన్ని నిర్మించింది. పాలరాతితో భర్త విగ్రహాన్ని తయారు చేయించి బుధవారం ఆవిష్కరించింది. భర్త జయంతి, వర్ధంతిని నిర్వహించి అన్నదానం చేస్తానని పేర్కొన్నారు.

నదుల అనుసంధానం.. నీటి హక్కులకు ద్రోహం

- నీటి లభ్యత, ఇతర అంశాలపై రాష్ట్రాల అభ్యంతరాలు
- ప్రభుత్వాలు మారితే ఒప్పందాల పరిస్థితేమిటి?
- శాస్త్రీయ అధ్యయనం చేయాలంటున్న రాష్ట్రాలు
- మహానది నుంచి నీటి మళ్లింపునకు ఒప్పుకోని ఒడిశా
- గోదావరి బేసిన్‌పై కేంద్రం కన్ను
- రాష్ట్రాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా ప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): నదుల అనుసంధానం పేరిట కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల నీటి హక్కులకు తీరని ద్రోహం తలపెడుతున్నదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. రాష్ట్రాల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా గోదావరి-కావేరి అనుసంధానాన్ని చేపట్టేందుకు సంసిద్ధమవుతుండటంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. సంబంధిత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా, సమ్మతి లేకుండానే నదుల అనుసంధానం ప్రాజెక్టులను చేపట్టనున్నట్టు గతంలోనే కేంద్రమంత్రి పార్లమెంట్‌లో ప్రకటించగా, ఇప్పుడు గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టుపై కేంద్రం శరవేగంగా అడుగులు వేస్తున్నది. తద్వారా తెలంగాణ జలహక్కులకు తీరని అన్యాయం వాటిల్లుతుందని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కేంద్రం తీరుపై సాగునీటి రంగ నిపుణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

తమిళనాడు కోసం తెలంగాణ పణం

ఒడిశాను ఒప్పించలేక చేతులెత్తేసి..

నదుల అనుసంధానం ద్వారా కరువు ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించాలనే ఆలోచనలు 1960లోనే మొగ్గతొడిగాయి. నేషనల్ రివర్ లింకింగ్ ప్రాజెక్టును చేపట్టాలని 2002లో కేంద్రంలోని నాటి ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం 2003లో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. ఆ తరువాత 2004 నుంచి పదేండ్లపాటు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వ హయాంలో బ్రేక్ పడింది. 2014లో కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడంతో మరోసారి కదలిక మొదలైంది. నదుల అనుసంధానం ప్రాజెక్టులు ముందుకు సాగక పోవడానికి ప్రధాన కారణం కేంద్రం ఒంటెత్తు పోకడలేనని నీటిరంగ నిపుణులు చెప్తున్నారు. హిమాలయ, ద్వీపకల్ప నదుల్లో మొత్తంగా 30 నదులను అనుసంధానం చేయాలని ప్రణాళికలు రూపొందించగా అందులో మహానది-గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి లింక్ ఒకటి. ఇందులో భాగంగా తొలుత గంగానది నుంచి వరద జలాలను మహానదికి మళ్లించాలి. ఆ తరువాత మహానది నుంచి 234 టీఎంసీలు, గోదావరి నుంచి 324 టీఎంసీలను కావేరికి మళ్లించాలి. ఇది ప్రాజెక్టు స్వరూపం. అందులో భాగంగా తొలుత ఫేజ్ 1 కింద మహానది నుంచి గోదావరికి 850 కిలోమీటర్ల కాలువ ద్వారా జలాలను మళ్లించాలి. ఫేజ్ 2 కింద గోదావరి నుంచి దాదాపు 1074 కిలోమీటర్ల కాలువ ద్వారా కావేరి నదికి మళ్లించాలి. అయితే, మహానది నుంచి 234 టీఎంసీల మిగులు జలాలను తరలించేందుకు ఒడిశా ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలో మహానది-గోదావరి లింక్‌ను వదిలిపెట్టి, గోదావరి-కావేరి లింక్ కోసం రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి చేస్తున్నది. ఎస్సారెస్పీ నుంచి ఇచ్చంపల్లి వరకు 177 టీఎంసీలు, ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 147 టీఎంసీలు కలిపి 324 టీఎంసీల మిగులు జలాలు ఉంటాయని, వాటిని కావేరికి మళ్లిస్తామని, ఆ తరువాత మహానది లింక్‌ను చేపడతామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు గోదావరి బేసిన్ రాష్ట్రాలన్నీ తిరస్కరించాయి. దీంతో ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 147 టీఎంసీలను తొలిదశలో కావేరికి మళ్లిస్తామని ప్రతిపాదించి, ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నది. తెలంగాణను ఎండబెట్టే విధంగా ఇచ్చంపల్లి వద్ద ఎత్తు పెంచి బరాజ్‌ను నిర్మించాలని కుయుక్తులు పన్నుతున్నది. రాష్ట్రాల అభ్యంతరాలను పట్టించుకోకుండా కేంద్రం ఏకపక్షంగా ప్రతిపాదనలు సిద్ధం చేయడం, వాటిని రాష్ట్రాలు వ్యతిరేకించడం పరిపాటిగా మారిపోయింది.

చారిత్రక రక్షణల ముప్పు

నదీ పరివాహక ప్రాంతాల్లోని రాష్ట్రాలకే తొలుత ఆ నదీ జలాలను వినియోగించుకునే హక్కులు ఉంటాయి. కానీ, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల పలు రాష్ట్రాలు పరివాహక ప్రాంతాల్లోని, బేసినేతర ప్రాంతాల్లోని నదీ జలాలను వాడుకుంటున్నాయి. నీటి వినియోగంలో వెనకబడిన రాష్ట్రాలు సైతం కాలక్రమంలో నదీ జలాలను వినియోగించుకునే సందర్భంలో ముందునుంచీ జలాలను వినియోగించుకునే ప్రాజెక్టులకు, రాష్ట్రాలకు చారిత్రక రక్షణ పేరిట ట్రిబ్యునల్స్ రక్షణ కల్పించాయి. కృష్ణా డెల్టా అందుకు ఉదాహరణ. శ్రీశైలం నుంచి చెన్నై తాగునీటికి కేటాయించిన 15 టీఎంసీలు మరో ఉదాహరణ. కృష్ణా బేసిన్‌లో లేకపోయినప్పటికీ, తమిళనాడుకు బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ చారిత్రక రక్షణ కల్పించింది. ఇప్పుడు ఇదే భయం గోదావరి-కావేరి నదుల అనుసంధానం విషయంలో వెన్నాడుతున్నది. ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని జలాలనే బేసిన్ వెలుపల ఉన్న తమిళనాడుకు తరలిస్తామని కేంద్రం చెప్తున్నది. భవిష్యత్తులో ఛత్తీస్‌గఢ్ జలాలను వినియోగించుకునేందుకు పూనుకుంటే తమిళనాడుకు మరోసారి హిస్టారికల్ ప్రొటెక్షన్స్ లభిస్తాయి. భవిష్యత్తులో గోదావరిలో వాటా కావాలని తమిళనాడు డిమాండ్ చేస్తుంది. అదే జరిగితే బేసిన్‌లోని తెలంగాణతోపాటు ఏపీ, ఇతర రాష్ట్రాల నీటి వినియోగాలపై ప్రభావం చూపుతుంది. భవిష్యత్తులో బేసిన్‌లోని రాష్ట్రాలకు, బేసిన్ వెలుపలి రాష్ట్రాలకు మధ్య నీటి వివాదాలకు ఆజ్యం పోస్తుందని సాగునీటి రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రాల హక్కులకు తీరని నష్టం

ఇప్పటికే ఆయా నదీ జలాలను సంబంధిత బేసిన్ రాష్ట్రాలకు ట్రిబ్యునళ్లు వాటాలను పంపిణీ చేశాయి. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా, ఆయా రాష్ట్రాల సమ్మతి లేకుండానే కేంద్రం ఏకపక్షంగా గోదావరి-కావేరి అనుసంధానం ప్రాజెక్టును చేపట్టేందుకు సమాయత్తమైంది. ఇరిగేషన్‌కు సంబంధించి రీ జనరేటెడ్ వాటర్‌ను ఎక్కడా పరిగణనలోకి తీసుకోకూడదంటూ సీడబ్ల్యూసీ నిర్దేశిస్తుంటే, అందుకు విరుద్ధంగా అదే రీ జనరేటెడ్ వాటర్ ఆధారంగా ఎన్‌డబ్ల్యూడీఏ రివర్‌లింక్ ప్రాజెక్టు ప్రతిపాదనలను సిద్ధం చేసింది. వాస్తవానికి ఇప్పటివరకు ఆయా నదులకు సంబంధించి మిగులు జలాలపై కచ్చితమైన లెక్కలు లేవు. దశాబ్దాల కింద వేసిన అంచనాలతోనే ప్రాజెక్టు ప్రణాళికలను రూపొందించింది. శాస్త్రీయమైన అధ్యయనం లేకుండా, నీటి లభ్యతపై సమగ్ర లెక్కలు అందుబాటులో లేకుండా ప్రాజెక్టును చేపడితే, ఆ మేరకు జలాలు లేకపోతే పరిస్థితి ఏమిటి? బేసిన్ రాష్ట్రాలు సైతం అనేక ఇబ్బందులు పడకతప్పదనేది నీటిరంగ నిపుణుల వాదన.

తెలంగాణకు తీరని నష్టం

- గోదావరి బేసిన్‌లోని రాష్ట్రాల్లో కూడా ఇప్పటికీ తీవ్రమైన కరువు పీడిత ప్రాంతాలు ఉన్నాయి. తెలంగాణలో ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ అందుకు ఉదాహరణ. బేసిన్ పరిధిలోని సాగు, తాగునీటి అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చకుండానే మిగులు జలాలను బేసిన్ వెలుపలి కరువు ప్రాంతాలకు తరలించే కేంద్రం ప్రతిపాదనలను సాగునీటిరంగ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భవిష్యత్తులో మరే ప్రాజెక్టును చేపట్టుకునే అవకాశమే ఉండబోదని హెచ్చరిస్తున్నారు.
- తెలంగాణకు లిఫ్ట్ పథకాలే శరణ్యం. వరదలు వచ్చినప్పుడు, నిల్వ చేసుకుని ఆ జలాలను లిఫ్ట్ చేసుకుంటూ వినియోగించుకోవాలి. కానీ, కేంద్రం గోదావరి-కావేరి పేరిట మిగులు జలాలను తరలిస్తామని చెప్తున్నది. ఇక్కడ సమస్య ఏమిటంటే మిగులు జలాలను, వరద జలాలను ఎలా నిర్ధారిస్తారు. అనే సమస్యని సాగునీటిరంగ నిపుణులు తెలుపుతున్నారు. సీజన్ తరువాత జలాలను మళ్లిస్తూ పోతే తెలంగాణ లిఫ్ట్ పథకాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు.